క్లుప్తంగా

బంగారమ్మ తల్లిని దర్శించుకున్న కోలగట్ల



బంగారమ్మతల్లిని దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: పట్టణంలోని కొత్తపేట యావదవీధిలో కొలువైన చల్లని తల్లి శ్రీ బంగారమ్మ తల్లి జాతర మహోత్సవంలో ఏపీ శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. గురువారం సాయంత్రం ఆ తల్లిని దర్శించుకుని పూజలు జరిపారు. సిరిలొలికే కల్పవల్లి, చక్కని తల్లి బంగారమ్మ చల్లని చూపు నియోజకవర్గ ప్రజలపై ఎప్పుడూ ఉండాలని కోలగట్ల ప్రార్థించారు. తొలుత స్థానిక ప్రజా ప్రతినిధులు, పెద్దలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఘనంగా సత్కరించారు. ఆయన వెంట రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి మండలి డైరెక్టర్ ఎస్.బంగారునాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు ముద్దాడ మధు, ఇసరాపు రామకృష్ణ, గదుల సత్యలత తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానం చేయాలి




రక్తదాన శిబిరంలో పాల్గొన్న మహిళలు

విజయనగరం: రక్తదానం ప్రాముఖ్యతను గుర్తించి యువత స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని రోటరీ పాస్ట్ గవర్నర్ ఆర్కే జైన్ విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని రోటరీ రక్త నిధి కేంద్రం వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రోటరీ ప్రతినిధులు పాల్గొని 45 యూనిట్ల రక్తాన్ని పార్వతి దేవి అంచాలియ రోటరీ రక్త నిధి కేంద్రానికి అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ పూర్వపు గవర్నర్ ఆర్.కె.జైన్ మాట్లాడుతూ రోటరీ బ్లడ్ బ్యాంకు విజయనగరంలో ఏర్పాటు చేయడం ద్వారా వందలాది మంది రోగులకు ఉచితంగా రక్తం సకాలంలో అందించి వారి ప్రాణాలను కాపాడడం జరిగిందన్నారు. రక్తదానానికి ముందుకు వస్తున్న యువతకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రక్తనిధి కేంద్రం కోశాధికారి ప్రవీణ్ అంచాలియాతో పాటు రోటరీ బ్లడ్ బ్యాంకు నిర్వహణకు సహకారం అందిస్తున్న పలువురిని సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షురాలు ఉమా బాలాజీ, కార్యదర్శి బి.సూర్యలక్ష్మి, మండా రవి, నారాయణ మూర్తి, రాధికారాణి, కాపుగంటి రవి, మాటూరు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

25లోగా ఈకేవైసీ చేయించుకోవాలి

బొండపల్లి: పీఎం కిసాన్ యోజన 14వ విడత పెట్టుబడి సాయం కోసం ఇంకా ఈకేవైసీ చేయించుకోని రైతులు అంతా తప్పని సరిగా ఈనెల 25వ తేదీలోగా చేయించుకోవాలని ఏఓ పి.వి.మల్లికార్జునరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.అలాగే పీఎం కిసాన్ రాని రైతులు సంబంధిత వీఆర్ఓను సంప్రదించి ఆధార్‌తో భూముల వివరాలను అనుసంధానం చేసుకోవాలని సూచించారు. రైతు భరోసాకు అర్హులైన రైతుల జాబితాను అన్ని రైతు భరోసా కేంద్రాల్లోపూ(ఆర్బీకే) అందుబాటులో ఉంచామని, అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈనెల 20 వతేదీలోగా ఆయా ఆర్బీకేల వీపీఏలకు రైతులు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు సన్మానం



రాజ్యలక్ష్మిని సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, తదితరులు

వేపాడ: మండలంలోని ఆకులసీతంపేట గ్రామ అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన కుప్పిలి రాజ్యలక్ష్మిని గ్రామస్తులు గురువారం సన్మానించారు. ఆమె అందించిన సేవలను గ్రామస్తులు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు కొనియాడారు. పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీస్, ఏఎస్ఎం ,ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

కట్టె జనుము, జీలుగు విత్తనాల పంపిణీ

దత్తిరాజేరు: మండలంలోని రామచంద్రాపురం సచివాలయంలో రైతులకు రాయితీపై జీలుగు, కట్టెజనుము విత్తనాల ను ఏఓ అనురాధ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తోందని చెప్పారు. రైతులు రెండుసార్లు వేసవి దుక్కులు చేసిన అనంతరం పచ్చిరొట్ట విత్తనాలు చల్లాలని సూచించారు. వీటి సాగు వల్ల భూసారం వృద్ధి చెంది పంట దిగుబడులు పెరుగుతాయని వివరించారు.

ఉద్యోగాల కల్పనకే స్కిల్ హబ్‌ల ఏర్పాటు

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స
- నెల్లిమర్లలో స్కిల్ హబ్ ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



స్కిల్ హబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

నెల్లిమర్ల: ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ అందించి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పివివి. సూర్యనారాయణరాజు(సురేష్‌బాబు) అన్నారు. పట్టణంలోని సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి స్కిల్ హబ్‌ను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం స్కిల్ హబ్‌ల ద్వారా నిరుద్యోగులైన యువతకు పలు అంశాల్లో శిక్షణ అందించడంతో పాటు పరిశ్రమలు, సంస్థల్లో ఉద్యోగాలను కల్పిస్తుందన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు పరిశ్రమల్లో 70 శాతం ఉద్యోగాలు స్థానిక యువతకు ఇవ్వాలన్న మాట రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నెరవేర్చారన్నారు. ఇటీవల విశాఖలో నిర్వహించిన పారిశ్రామిక సమ్మిట్ ద్వారా బడా కంపెనీలు త్వరలోనే ఆ నగరంలో ఏర్పాటవుతాయన్నారు. తద్వారా విశాఖపట్నం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఉత్తరాంధ్రకు జాబ్ హబ్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అందరికీ కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నాడు-నేడుతో పాఠశాలలను అభివృద్ధి చేసిందన్నారు. ఇటీవల నియోజకవర్గ స్థాయిలో మెగా జాబ్ మేళాను నిర్వహించామని 2500 మంది నిరుద్యోగులు హాజరయ్యారని ఎమ్మెల్యే చెప్పారు. వారిలో 670 మందికి వివిధ సంస్థల్లో ఉద్యోగాలు లభించాయని పేర్కొన్నారు. త్వరలోనే మరో మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.గిరిబాల, నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్‌చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ పట్టణశాఖ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, కళాశాల ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే బాల్య వివాహాలకు చెక్



ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి కార్యక్రమ వివరాలు వివరిస్తున్న కేసలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి

నెల్లిమర్ల: నియోజవర్గంలో బాల్య వివాహాల నిర్మూలనకు సహకారం అందించాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పివి వి.సూర్యనారాయణరాజు(సురేష్‌బాబు)కు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు కోరారు. నియోజకవర్గ కేంద్రం నెల్లిమర్లలో గురువారం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని కలిసిన అప్పారావు నియోజకవర్గ వ్యాప్తంగా త్వరలో చేపట్టబోయే బాల్య వివాహాల నిర్మూలనా సమావేశాలపై చర్చించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా బాల్య వివాహాలు జరుగుతున్నాయో గుర్తించి, ఆయా ప్రాంతాల్లో విరివిగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. దీనికై స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుంటున్నట్లు తెలిపారు. అంతేగాకుండా ఆయా మండలాలకు చెందిన అధికారులు, పోలీసులు, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులను సైతం దీనిలో భాగస్వాములను చేస్తామన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించి, బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించడానికి సహకారం అందించాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతో పాటు నెల్లిమర్ల నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్‌చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావును కేసలి కోరారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం పరిశీలన



సతివాడలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఓ పూర్ణిమ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏఓ పూర్ణిమ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కజొన్న క్వింటాకు రూ.1962 కనీస మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మొక్కజొన్న రైతులు కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రానికి మొక్కజొన్న పంటను ఇచ్చే రైతులు ముందుగా స్థానిక ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. తేమ శాతాన్ని పరిశీలించి కొనుగోలు చేస్తామన్నారు. ఇప్పటి వరకు మండలంలో 210 క్వింటాళ్ల మొక్కజొన్నను కొనుగోలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ సారథి సీఎం జగన్

- నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



ప్రభుత్వ పథకాల వివరాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తదితరులు

డెంకాడ: ప్రజా సంక్షేమ సారథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని డి.తాళ్లవలస పంచాయతీలోని టి.కల్లాలు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం జరిగింది. దీనిలో భాగంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తదితరులు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయా కుటుంబాలకు అందించిన ప్రభుత్వ పథకాలు, కలిగిన ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అప్పలనాయుడు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రతీ పేద కుటుంబానికి మేలు జరిగిందన్నారు. పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు ప్రజలకు మేలు చేయాలన్న సంకల్పంతో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఆర్థిక చేయూతను అందిస్తున్నారని వివరించారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. ప్రభుత్వ పాలనను దీని ద్వారా ప్రజల ముంగిటకు తెచ్చారని వివరించారు. సమగ్ర భూ సర్వే ద్వారా రైతులకు మేలు చేస్తున్నారన్నారు. పింఛన్‌దారులకు ఠంచన్‌గా ప్రతీ నెల 1వ తేదీన వలంటీర్లు నేరుగా వారి ఇంటికే వచ్చి పింఛన్ డబ్బులను అందిస్తున్నారని తెలిపారు. ఇంతటి సంక్షేమ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచ్ తోరోతు త్రిమూర్తులు, ఎంపీడీఓ స్వరూపారాణి, పలువురు నాయకులు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఏఓ అనురాధ

బొండపల్లి: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్బీకే) ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీకి చర్యలు తీసుకున్నామని ఏఓ పి.వి.మల్లికార్జునరావు గురువారం తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ ఆధార్ కార్డును తీసుకుని ఆర్బీకేల్లో వీపీఏల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జీలుగు విత్తనాలు 10 కిలోల పూర్తి ధర రూ.790 కాగా 50 శాతం రాయితీ పోగా రూ.395కు, కట్టెజనుమ పూర్తి ధర రూ.840 కాగా రాయితీపై రూ.420కు,పిల్లి పెసర 8 కిలోలు రాయితీపై రూ.388కు అందించనున్నట్లు పేర్కొన్నారు.

లేగదూడల సంరక్షణపై అవగాహన



రైతులకు సూచనలు చేస్తున్న పశుగణాభివృద్ధి శాఖ సీఈఓ దామోదర్‌నాయుడు

వేపాడ: లింగ క్రమబద్ధీకరణ, కృత్రిమ గర్భధారణ విధానంలో జన్మించిన ఆడ లేగదూడల సంరక్షణ, పెంపకంలో తీసు కోవాల్సిన జాగ్రత్తలపై బల్లంకి గ్రామంలో పాడిరైతులకు పశుగణాభివృద్ధిశాఖ కార్యనిర్వాహణాధికారి దామోదరనాయుడు ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు.ముందుగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పశుగణాభివృద్ధిశాఖ అధికారి దామోదరనాయుడు మాట్లాడుతూ లింగ క్రమబద్ధీకరించిన వీర్యంతో పశువులకు కృత్రిమ గర్భధారణ చేయడం వల్ల ఆడదూడలు మాత్రమే జన్మిస్తాయని చెప్పారు. ఈ దూడలకు క్రమం తప్పకుండా విటమిన్ -ఏ ఇంజక్షన్లు వేయించాలన్నారు. దూడలకు ముర్రుపాలు తాగించాలని, అందించాల్సిన ఆహారం గురించి వరించారు. అనంతరం ప్రదర్శనలో పాల్గొన్న లేగ దూడల్లో మూడింటిని ఎంపిక చేసి సంబంధిత పాడి రైతులకు బహుమతులు అందజేశారు. ఎస్.కోట పశుసంవర్ధక శాఖ ఏడీఏ చలపతిరావు, వేపాడ పశు వైద్యాధికారి సింహాచలం నాయుడు, స్థానిక నాయకులు బొడ్డు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'ఫ్యామిలీ డాక్టర్' సేవలు



వేపాడ: ఎం.శింగవరంలో రోగులకు వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి ధరణి



గజపతినగరం: బూడిపేటలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సుష్మా

వేపాడ: మండలంలోని మైచర్ల శింగవరంలో వేపాడ పీహెచ్‌సీ, 104 వైద్యులు సంయుక్తంగా గురువారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నిర్వహించిన శిబిరంలో 90 మందికి వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ ధరణి గర్భిణులకు తనిఖీలు నిర్వహించి, ఆరోగ్య సూత్రాలు, తీసుకోవాల్సిన పౌష్టికాహారం తదితర జాగ్రత్తలు వివరించారు. ఆస్పత్రిలో ప్రసవాలు చేయించుకోవడం తల్లీబిడ్డలకు క్షేమమన్నారు. హైరిస్క్ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. మధ్యాహ్నం గృహసందర్శన చేసి ప్రజలకు వైద్య సేవలందించారు. హెచ్ఎస్ వెంకటరమణ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

96 మందికి వైద్య పరీక్షలు

గజపతినగరం: స్థానిక గ్రామసచివాలయం-2 పరిధిలోని వెంకటాపురం, దావాలపేట,బూడిపేట గ్రామాల్లో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మా ఆధ్వర్యంలో గురువారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన శిబిరాల్లో 96 మందికి వైద్య సిబ్బంది వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వైద్యతనిఖీలు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ శివానీ, ఆరోగ్య కార్యకర్త బేగమ్, ఆశ కార్యకర్తలు గాయత్రి, హేమ,డీఈఓ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న చిక్కాల

నెల్లిమర్ల: నగరపంచాయతీ పరిధిలోని శ్మశానంలో పలు అభివృద్ధి పనులకు వైఎస్సార్‌సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వైస్‌చైర్మన్ కారుకొండ వెంకట కృష్ణారావు గురువారం శంకుస్థాపన చేశారు. స్థానిక రామతీర్థం కాజ్‌వేకు సమీపంలో చంపావతి నది ఒడ్డున ఉన్న శ్మశానంలో షెడ్డు నిర్మించి, బోరు ఏర్పాటు చేయడంతో పాటు రహదారిని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రూ. 6 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో పనులు చేపట్టడానికి శంకుస్థాపన గావించిన చిక్కాల, కారుకొండ మాట్లాడుతూ ఈ శ్మశానంలో వర్షాకాలంలో దహన సంస్కారాలకు, వేసవిలో నీటికి పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు దృష్టికి తీసుకెళ్లగా స్పందించి, అవసరమైన నిధులు మంజూరు చేశారన్నారు. భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టరును కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మైపాడ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు బూర సత్యనారాయణ, బంగారు శంకరరావు, మజ్జి గణేశ్, కారుకొండ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ అరెస్టుకు డిమాండ్



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: క్రీడాకారులని లైంగికంగా వేధిస్తున్న రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ని అరెస్ట్ చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విజయనగరం కాంప్లెక్స్ వద్ద గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు సౌమ్య, ఐద్వా కార్యదర్శి రమణమ్మ, డీవైఎఫ్ఐ కార్యదర్శి రుద్ర ప్రసాద్ మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలో గత 25 రోజులుగా మహిళా రెజ్లర్లు తమపై జరిగిన లైంగిక వేధింపులకు నిరసనగా జంతర్ మంతర్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. దేశ ప్రతిష్ఠని పెంచే మన క్రీడాకారులు తమకు అన్యాయం జరిగిందని పోరాడుతుంటే వాళ్లకి న్యాయం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం తిరిగి క్రీడాకారులపైనే దాడులు చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేసి మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్, రామ్మోహన్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు హరీష్, సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

పునః ప్రారంభం నాటికి పనులు పూర్తి కావాలి

- హెచ్ఎంల సమావేశంలో ఎంపీడీఓ గిరిబాల



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గిరిబాల

నెల్లిమర్ల: వచ్చే నెల జూన్ 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం నాటికి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని ప్రధానోపాధ్యాయులకు ఎంపీడీఓ జి.గిరిబాల ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో హెచ్ఎంలు, సచివాలయ ఇంజినీరింగ్ కార్యదర్శులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నాడు-నేడు ఫేజ్ 1, 2 పాఠశాలలతో పాటు మిగిలిన పాఠశాలల్లో కూడా విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు హెచ్ఎంలు చర్యలు చేపట్టాలన్నారు. దీని కోసం రెండు విడతల్లో మంజూరైన పాఠశాలల ప్రహరీలు, అదనపు తరగతి గదుల నిర్మాణాలకు సంబంధించి మిగులు నిధులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఆ దిశగా హెచ్ఎంలు సహకరించాలని కోరారు. అలాగే గ్రీన్ చాక్ బోర్డులకు బదులు ఐఎఫ్‌టీ బోర్డులను ప్రభుత్వం అందజేస్తోందని చెప్పారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమయ్యే సౌకర్యాలను జూన్ 12లోగా సమకూర్చాలని ఎంపీడీఓ ఆదేశించారు. నాడు-నేడు పనులకు సంబంధించి ఇప్పటికే ప్రారంభమైన పనులను గడువులోగా పూర్తి చేయాలన్నారు. పనులు పూర్తి చేయని హెచ్ఎంలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఏఈ శ్రీరాములనాయుడు, వైకేపీ ఏపీఎం సత్యనారాయణ, హౌసింగ్ ఏఈ ఆర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి ఉపశమనం

సూర్య భగవానుడు భగభగమంటున్నాడు. పగటి పూట ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగాయి. ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ క్రమంలో జనం ఇలా ఐస్‌క్రీం, తాటి ముంజెలు, కర్బూజ వంటి వాటితో దాహార్తిని తీర్చుకుంటున్నారు. వేసవి నుంచి ఉపశమనం పొందుతున్నారు.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



కర్బూజతో దాహార్తిని తీర్చుకుంటున్న బాలుడు



తాటి ముంజెల విక్రయాలు



కోట ప్రాంతంలో ఐస్ క్రీమ్ తింటున్న యువత

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు పెంచండి



బోనంగి అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ శాంతకుమారి

గంట్యాడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు పెంచాలని ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి సూచించారు. మండలంలోని బోనంగి, గింజేరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను, నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందితో ఆమె మాట్లాడుతూ కచ్చితంగా సమయపాలన పాటించాలని, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పిల్లలకు ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని అన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆమె వెంట సీడీపీఓ ఉమాభారతి ఉన్నారు.

వేపాడలో నేత్ర వైద్యశిబిరం

వేపాడ: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంటీ స్థానిక పాలకేంద్రం వద్ద శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 75 మందికి అప్తాలమిక్ అలేఖ్య కంటి పరీక్షలు చేసి 45 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారని క్యాంపు కో-ఆర్డినేటర్ జోగారావు తెలిపారు. అందరికీ ఉచితంగా కంటి ఆపరేషన్ చేయించి కళ్లద్దాలు అందించనున్నామని చెప్పారు.